

నేడు, రేపు గ్రూప్-3 పరీక్ష

- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం
- హాజరుకానున్న 19,941 మంది అభ్యర్థులు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా ఈనెల 17, 18 తేదీలలో జరుగనున్న గ్రూప్-3 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఈనెల 17న ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30ల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30ల వరకు సెకండ్ సెషన్ పరీక్షలు జరుగుతాయని సోమవారం ఉదయం సెషన్‌లో పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు. జిల్లాలో మొత్తం 19వేల 941 మంది అభ్యర్థులు పరీక్ష రాయనుండగా అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాకేంద్రంలో 66పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా ప్రతీ మూడు కేంద్రాలకు ఒకరు చొప్పున 22మంది ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామని, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు అనుక్షణం నిశిత పర్యవేక్షణ జరుపుతాయని అన్నారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయని ఆయన తెలిపారు. బయోమెట్రిక్ విధానం ద్వారా వేలి ముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఉదయం పరీక్షకు సంబంధించి 9.30ల వరకే అభ్యర్థులు పరీక్ష కేంద్రంలోకి వెళ్లేందుకు అనుమతి ఇవ్వడం జరుగుతుందని అనంతరం గేట్లు మూసివేయడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం పరీక్షకు సంబంధించి 2.30ల తర్వాత ఎవరిని లోనికి అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. చీఫ్ సూపరింటెండెంట్‌కు తప్ప ఎవరికి పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్ అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని ఈ మేరకు ప్రతీ కేంద్రం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని ఆదేశించామన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా సజావుగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

పరీక్ష కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలి

ఆర్మూర్ మార్గంలో అడవి మామిడిపల్లి ఆర్‌యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మాణం పనులు కొనసాగుతున్న దృష్ట్యా ఈనెల 17, 18 తేదీలలో గ్రూప్-3 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిర్ణీత సమయానికి ముందే తమకు కేటాయించబడిన పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. అడవి మామిడిపల్లి వద్ద ఆర్‌యుబి పనులు జరుగుతున్నందున నవంబర్ 10 నుంచి డిసెంబర్ 10 వరకు నెల రోజుల పాటు నిజామాబాద్ - ఆర్మూర్ మార్గంలో వాహనాల రాకపోకలను దారి మళ్లించడం జరిగిందని గుర్తు చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని గ్రూప్-3 పరీక్షల కోసం ఆర్మూర్ వైపు వెళ్లాల్సిన వారు, ఆర్మూర్ నుంచి నిజామాబాద్ వైపు వచ్చే అభ్యర్థులు ప్రత్యామ్నాయ మార్గాల్లో కేంద్రాలకు చేరుకోవాల్సి ఉన్నందున నిర్ణీత సమయానికంటే ముందుగానే బయలుదేరాలని సూచించారు.

ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఏదీ?



- పలు మండలాల్లో ఇష్టారీతిన ఇసుక తవ్వకాలు
- మంజీరా, పెద్దవాగు, కప్పలవాగు, పూలాంగ్ వాగుతో పాటు ఇతర వాగుల నుంచి ఇసుక రవాణా
- ప్రభుత్వ భూములు, అటవీ, చెరువు శిఖం భూముల్లో అక్రమంగా మట్టి, మొరం తవ్వకాలు
- అధికార ప్రతిపక్ష పార్టీల నేతల సహకారంతో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ రవాణా

నిజామాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఇసుక, మట్టి, మొరం అక్రమ రవాణాపై నిఘా కరువైంది. అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. వాగులు, నదుల నుంచి యథేచ్ఛగా తరలిస్తున్న పట్టించుకునేవారు లేరు. గుట్టలు, ప్రభుత్వ భూముల నుంచి మట్టి, మొరం తవ్వకాలు చేస్తున్న చూడటం లేదు. కనీసం పట్టుకొని కేసులు నమోదు చేయడం లేదు. ప్రజాప్రతినిధులు, నేతల కనుసన్నల్లో రాత్రివేళల్లో యంత్రాలతో తవ్వకాలు చేస్తున్నారు. టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలింపు చేస్తున్నారు. అధికార పార్టీ నేతలతో పాటు ఇతర పార్టీల నేతలు కూడా సహకరిస్తుండటంతో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. రైతులు, గ్రామాలకు చెందిన వారు ఫిర్యాదులు చేస్తే కొన్ని వాహనాలు పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు చేయడంతో భూగర్భజలాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి కూడా గండి పడుతోంది. అనుమతులు లేకుండా తరలిస్తున్న ఈ రవాణాను మండల స్థాయిలో అరికట్టకపోవడం వల్ల జిల్లాలు దాటి ఇసుక తరలిపోతుంది.

ఇష్టారీతిన తవ్వకాలు

జిల్లాలో ఇసుక తవ్వకాలకు అనుమతుల్లేవు. గత కొన్నేళ్లుగా మంజీరాతో పాటు వాగుల వెంట క్వారీలను మంజూరు చేయడం లేదు. పట్టా భూముల్లో కూడా ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం లేదు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు మాత్రమే ఆయా మండలాల పరిధిలోని వాగులు, మంజీరా వెంట తవ్వకాలకు మండల స్థాయి అధికారులు అనుమతులు ఇస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న రోడ్లు, భవనాలు ఇతర నిర్మాణాలకు ఇసుకను తవ్వుకునేందుకు అనుమతులను మంజూరు చేస్తున్నారు. ఆయా మండలాల తహశీల్దార్లకు డీడీల రూపంలో డబ్బులు చెల్లిస్తే పనులను బట్టి అనుమతులను మంజూరు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ అనుమతులను తీసుకుంటున్న కొంత మంది ఇసుకను ఎక్కువగా తవ్వకాలుచేసి అక్రమంగా తరలిస్తున్నారు. వీరేకాకుండా రాత్రివేళల్లో మంజీరా నది వెంట తవ్వకాలు చేస్తున్నారు. నదిలో నీటి ప్రవాహం ఉన్న సరిహద్దుల వెంట ఇసుకను తవ్వుతున్నారు. జిల్లా పరిధిలోని ప్రధానంగా పెద్దవాగు, కప్పలవాగు, పూలాంగ్ వాగుతోపాటు ఇతరవాగుల నుంచి రాత్రివేళల్లో తవ్వకాలను చేస్తున్నారు. జిల్లా పరిధిలోని పోతంగల్, సాలూరా, రేంజల్, నవీపేట, నందిపేట, ఆర్మూర్, వేల్పూర్, జక్రాన్‌పల్లి, భీంగల్, మోర్తాడ్, ఏర్గట్ల, మెండోరా, ధర్పల్లి, డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలాల పరిధిలో ఈ తవ్వకాలను చేస్తున్నారు. రాత్రివేళల్లో ఇసుకను యంత్రాల ద్వారా తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా బయటకు తీసుకొస్తున్నారు. ఆయా గ్రామాల పరిధిలో డంప్‌లను ఏర్పాటు చేసి అవసరమైన ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నారు. కొంత మంది రాత్రివేళల్లోనూ టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు ఇసుకను చేరవేస్తున్నారు. భవన నిర్మాణాలు జరుగుతుండటంతో ఇసుకకు డిమాండ్ కూడా పెరిగింది. ఇతర ప్రాంతాల నుంచి ఇసుకను కొనుగోలు చేస్తున్న నిర్మాణాదారులు స్థానిక అవసరాల కోసం ఇక్కడి వాగులు, మంజీరా ఇసుకపై ఆధారపడుతున్నారు. రాత్రివేళల్లో ఇవి జరుగుతున్నా అధికారులు ఆవైపు చూడటం లేదు. రైతులతో పాటు గ్రామస్తులు ఫిర్యాదులు చేస్తే కొన్ని కేసులను నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తున్నారు. అనుమతులతో పాటు పర్యవేక్షణ వివిధ శాఖల పరిధిలో ఉండటంతో సమన్వయం లేకపోవడం వల్ల పెద్ద ఎత్తున తరలిపోతుంది.

ఆగని మొరం తవ్వకాలు

జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మొరం తవ్వకాలు సాగుతున్నాయి. నగరానికి దగ్గరగా ఉన్న నిజామాబాద్ రూరల్, డిచ్‌పల్లి, మోపాల్, ఎడపల్లి, మోస్రా, చందూర్, రుద్రూర్, బోధన్, నవీపేట, మాక్లూర్, ఆర్మూర్, నందిపేట, జక్రాన్‌పల్లి, భీంగల్ మండలాలతో పాటు ఇతర మండలాల్లో ఎక్కువగా ఈ మట్టి, మొరం తవ్వకాలను చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు క్వారీలకే అనుమతులు

(...మిగతా 8వ పేజీలో)

బోధన, పరిశోధనపైనే దృష్టి

- 'ఆంధ్రజ్యోతి'తో తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ.యాదగిరిరావు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



డిచ్‌పల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన బోధన, పరిశోధనా రంగాలపై అవగాహన కల్పించేలా ప్రత్యేక దృష్టి పెడుతున్నామని తెలంగాణ విశ్వవిద్యాలయ వైస్‌చాన్స్‌లర్ ప్రొ. యాదగిరిరావు వెల్లడించారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి: తెలంగాణ యూనివర్సిటీని ఎలా ముందుకు తీసుకెళ్లబోతున్నారు?
వీసీ: ఎంతో ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్ర పేరుతో ఉన్న తెలంగాణ యూనివర్సిటీకి వీసీగా పని చేయడం గర్వంగా ఉంది. తెలంగాణ యూనివర్శిటీని అన్నివిధాలుగా ముందుంచేందుకు కృషి చేస్తున్నా.

ఆంధ్రజ్యోతి: బోధనారంగంలో ఏయే నిర్ణయాలు తీసుకోనున్నారు?
వీసీ: బోధన, పరిశోధనా రంగంలో ప్రత్యేక దృష్టి సారిస్తాను. అధ్యాపకులు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విధుల్లో ఉండేలా ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం.

ఆంధ్రజ్యోతి: వర్సిటీలో వర్గాలుగా అధ్యాపకులు విడిపోయారనే అపవాదు ఉంది.. వారితో కలిసి ఎలా ముందుకు సాగుతారు.
వీసీ: ఈ విషయం ఇప్పటికే తన దృష్టికి వచ్చింది. ఇప్పుడు అందరూ ఐక్యతతో పనిచేసేలా వాతావరణం కల్పిస్తాం.

ఆంధ్రజ్యోతి: క్రీడల్లో విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తారు?
వీసీ: నేను స్వయంగా ఓ క్రీడాకారుడిని. క్రీడల విషయంలో ప్రత్యేక అవగాహన ఉంది. వర్సిటీలో త్వరలోనే బాలబాలికలకు వేర్వేరుగా జిమ్‌లను ఏర్పాటు చేయిస్తాం. క్రీడాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: నూతన సైన్స్ భవన నిర్మాణ పనుల పురోగతి ఉందా?
వీసీ: రూసా నిధులతో కొనసాగుతున్న సైన్స్ భవననిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. రానున్న రెండు, మూడు నెలల్లో భవనం పూర్తయి విద్యార్థులకు అందుబాటులోకి రానుంది.

ఆంధ్రజ్యోతి: గత కొన్నేళ్లుగా డిమాండ్ ఉన్న ఇంజనీరింగ్ కళాశాల వర్సిటీలో వస్తుందా?
వీసీ: ఇంజనీరింగ్ కళాశాలపై ప్రభుత్వానికి, ఉన్నత విద్యామండలికి నివేదికలు పంపించాం. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిని కూడా కలిసి వివరించాం. ఏర్పాటుపై సీఎం సానుకూలంగా ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: వర్సిటీకి ఈ ఏడాది న్యాక్ గుర్తింపు లభిస్తుందా ?
వీసీ: దీనిపై ఇప్పటికే విభాగాధిపతులను సమావేశపర్చి నివేదికలు తయారు చేయాలని ఆదేశించాం. త్వరలోనే న్యాక్‌కు సెల్ఫ్ రిపోర్టు సమర్పిస్తాం. న్యాక్ బృందం వచ్చేలోపు అన్నిఏర్పాటు చేస్తాం. మంచి గుర్తింపు లభిస్తుందని ఆశిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: వర్సిటీ పరిధి పెంపు ఉంటుందా?
వీసీ: టీయూ పరిధి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకే మాత్రమే పరిమితమైంది. దీన్ని ఆదిలాబాద్, నిర్మల్, మెదక్ పరిధిలోని కళాశాలను వర్సిటీ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

ఆంధ్రజ్యోతి: బాలికల హాస్టల్‌పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు?
వీసీ: బాలికలకు వసతిగృహం ఒకటే ఉంటడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని హాస్టల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.6 కోట్లు మంజూరు చేసింది. త్వరలో పనులు ప్రారంభమవుతాయి. ఇప్పటికే టెండర్లను పిలిచాం.

ఆంధ్రజ్యోతి: వివాదాలలో ఉన్న వర్సిటీని ఎలా గాడిన పెడుతారు?
వీసీ: తెలంగాణ పేరుతో ఉన్న వర్సిటీలో గతంలో పలు విషయాలపై ఆందోళనలు జరగడం బాధాకరం. ఇకపై వివాదాలకు ఫుల్‌స్టాప్ పెట్టి విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.

హాస్టల్ భవనం నిర్మాణమెప్పుడో?

- తెలంగాణ యూనివర్సిటీలో బాలికలకు వసతి కరువు
- ఇరుకుగా హాస్టల్ భవనం.. ఒకే భవనంలో 500 మందికి వసతి
- 300 మందికి సరిపడే భవనంలో 500 మంది విద్యార్థులకు వసతి.. ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు

7



ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఆటలు ఆడాలి

- క్రీడలు మానసిక ఒత్తిడిని దూరం చేస్తాయి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

8





మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి

ఓటమితో కుంగిపోవద్దు

- విజయం కోసం ప్రయత్నిస్తూనే ఉండాలి: జిల్లా న్యాయాధికారి కుంచాల సునీత

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారు ఓటమితో కుంగిపోకుండా విజయమే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకుపోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి సునీత అన్నారు. నగరంలోని చంద్రశేఖర్‌కాలనీలోగల ప్రాంతీయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పరీక్షలకు సిద్ధమయ్యేవారు ఓటమితో అనుభవాలు నేర్చుకొని ముందుకు సాగినప్పుడే విజయం వస్తుందన్నారు. 2003 నుంచి 2013 వరకు పదేళ్లు కష్టపడి తొమ్మిది నోటిఫికేషన్ల తర్వాత 10వ నోటిఫికేషన్‌తో జిల్లా న్యాయాధికారిగా నియమితులయ్యానని తన అనుభవాన్ని విద్యార్థులకు వివరించారు. ఉద్యోగం కోసం దృఢమైన సంకల్పంతో కష్టపడాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న దాసు సురేష్

రాష్ట్రంలో వచ్చేది బీసీల రాజ్యమే

- రాజ్యాధికారం కోసం పోరాటమే మార్గం
- బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్

నిజామాబాద్ అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో రానున్నది బీసీల రాజ్యమేనని బీసీల రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశ లో శనివారం పాల్గొన్నారు. బీసీలు రాజ్యాధికారం కోసం పోరాడకపోవడంతోనే జాతీయపార్టీలు పట్టించుకోవడం లేదని అన్నారు. బీసీలకు రాజ్యాధికారంలో సమాన వాటా కోసం, హక్కుల కోసం, పార్టీ టిక్కెట్ల కోసం ఎదురు చూసేది లేదన్నారు. పోరాటాల ద్వారానే బీసీలకు సమాన వాటా వస్తుందన్నారు. జాతీయ పార్టీలు ఓబీసీలను అమాయకులను చేసి మోసపూరిత విధానాలను అవలంబిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న అన్ని రాజకీయ పార్టీలది అవకాశవాదమేనని ఆయన అన్నారు. దేశ రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయిలో నేడు బీసీ వర్గాలు ఉన్నాయని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కులగణనను చేసి నివేదిక బయటపెట్టకుండా కొన్ని రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. మరికొన్ని పార్టీలు మళ్లీ కులగణన చేస్తామని అంటున్నాయని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న కులగణనపై సరైన పర్యవేక్షణ లేదని ఆయన అన్నారు. బీసీలంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాజ్యాధికారమే ఎజెండాగా ముందుకు సాగాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని మండలాల పరిధిలో బీసీ కుల సంఘ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. ఉత్తర తెలంగాణలో త్వరలో లక్ష మందితో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఆయనతో పాటు పలువురు బీసీ సంఘ నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న దృశ్యం

ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడాపోటీలు ప్రారంభం

- క్రీడలను ప్రారంభించిన అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్
- తొలిరోజు హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



ఈషా ప్రతినిధులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్



క్రీడలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

సుభాష్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న క్రీడాపోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రీడల ద్వారా గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీయవచ్చని, ఇలాంటి క్రీడలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం ఈషా ఫౌండేషన్ సభ్యురాలు వెన్నెల మాట్లాడుతూ మొదటిరోజు సుమారు 20 జట్లు వాలీబాల్ పోటీలలో పాల్గొన్నాయని అన్నారు. ఈ పోటీల్లో గెలిచినవారికి మొదటి బహుమతిగా రూ.9వేలు, రెండోబహుమతి రూ.6వేలు, మూడో బహుమతి రూ.3వేలు, నాల్గో బహుమతి రూ.2వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. రెండోరోజు మహిళల కోసం త్రోబాల్ క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో మొదటి విజేతకు రూ.5వేలు, రెండో విజేతకు రూ.3వేలు, మూడో విజేతకు రూ.2వేలు, నాల్గో విజేతకు రూ.1500 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు, అనంతరం జాతీయస్థాయి పోటీలు కోయంబత్తూర్‌లో ఉంటాయని తెలిపారు. తొలిరోజు వాలీబాల్ పోటీలో మల్కాపూర్, గన్నారం పోటీపడగా గన్నారం జట్టు విజయం సాధించింది. అనంతరం రెండో మ్యాచ్‌ల రామసేనా యూత్, మెంట్రాజ్‌పల్లి జట్లు పోటీపడగా రామసేనా జట్టు గెలిచింది. మూడో పోటీలో సిర్నాపల్లి, మగ్గిడి జట్లు పోటీపడగా మగ్గిడి జట్టు అలవోకగా విజయం సాధించింది. కార్యక్రమంలో ఈషా ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ ఇంద్రాక్షిణి, భాగేషా, కిశోర్, హరీష్, పృథ్వీ, వెంకటేశ్, రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.



మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న ఈషా ప్రతినిధులు

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఇసుక ట్రాక్టర్లు

కోటగిరి,నవంబరు16(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎత్తొండ క్యాంప్‌లో శుక్రవారం రాత్రి రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. పొతంగల్ మండలంలోని సుంకిని గ్రామం నుండి ఇసుకను తరలిస్తుండగా స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్ఐ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

హిందూ ధర్మం పవిత్రమైనది: పిట్ల కృష్ణ మహరాజ్



గోదారమ్మకు మహ హారతిని సమర్పిస్తున్న పిట్ల కృష్ణ మహరాజ్

రెంజల్,నవంబరు16(ఆంధ్రజ్యోతి): హిందు ధర్మం ఎంతో పవిత్రమైనదని, ప్రతి ఒక్కరు ధర్మమార్గంలో నడిచినప్పుడే జన్మ సార్థకం అవుతుందని మల్లారం గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ పిట్ల కృష్ణ మహరాజ్ అన్నారు. శనివారం మల్లారం గుట్ట నుండి పాదయాత్రను కందకుర్తి వరకు చేపట్టారు. ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి రోజు నుండి మల్లారం ఆశ్రమం నుండి కందకుర్తి గోదావరి నది వరకు పాదయాత్ర చేపట్టి కందకుర్తి త్రివేణి సంగమంలో గంగమ్మకు మహ హారతి సమర్పించి పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కందకుర్తికి పాదయాత్రగా చేరుకున్న పిట్ల కృష్ణ మహరాజ్‌కు గ్రామగ్రామాన భక్తులు పూలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందు ధర్మాన్ని ఆచరించి ధర్మానికి పాటుపడాలని, ప్రతి ఒక్కరు ధర్మమార్గంలో ప్రయాణించి దేవుడి సేవతో పాటు దేశ సేవను కూడా కొనసాగించాన్నారు. మానవ జీవితానికి భక్తిమార్గం అత్యంత ముఖ్యమైనదని మానవ జీవితంలో దైవ కార్యం అనేది ముఖ్య పాత్ర అని అన్నారు. అనంతరం కందకుర్తి గోదావరమ్మకు మహ హారతిని సమర్పించి గోదావరిలో పుణ్యస్నానాన్ని ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట సీతారాంత్యాగి మహరాజ్ తదితరులున్నారు.

నారా రామ్మూర్తి మృతి పార్టీకి తీరని లోటు

బోధన్‌రూరల్,నవంబరు16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకుడు సోదరుడు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతి పార్టీకి తీరని లోటని తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు కోట గోపాల్ రెడ్డి అన్నారు. శనివారం నారా రామ్మూర్తి నాయుడు మృతి పట్ల బోధన్‌లో తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు వేములపల్లి శ్రీరామ్మూర్తి, పావులూరి వెంకటేశ్వర్ రావు, ఎం.ఉదయ్ భాస్కర్, విఠల్, ఎత్తొండ రాజేందర్, ఎన్‌టీఆర్ అభిమాన సంఘం నాయకులు పల్లెంపాటి శివన్నారాయణ, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

మహా ధర్నాకు తరలిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

బోధన్‌రూరల్,నవంబరు16(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద చేపట్టిన మహ ధర్నాకు బోధన్ మండలం నుండి ఎస్ఎస్ఏ ఉద్యోగులు వాహనాలలో భారీ సంఖ్యలో తరివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులను ప్రభుత్వం తక్షణమే మినిమమ్ టైమ్ స్కేల్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ మేరకు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుసుఫ్, బాబు, విజయ, రేఖ, గంగాధర్, అరవింద్, తదితరులున్నారు.

ప్రభుత్వమే ఆటోవాలాలను ఆదుకోవాలి

బాన్సువాడటౌన్ , నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేయడంతో ఆటోవాలాల జీవనం దుర్భరంగా మారిందని , ప్రభుత్వమే వారిని ఆదుకోవాలని సీఐటీయూ నాయకుడు ఖలీల్ చేశారు. శనివారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ రోజు ఆటోవాలాలు ప్రయాణీకులు లేక జీవన భృతి కోల్పోతున్నారన్నారు. ఆటోడ్రైవర్లకు జీవన భృతి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 20న బాన్సువాడ బస్‌డిపో నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ఆటోడ్రైవర్లతో కలిసి ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆటో యూనియన్ నాయకులు , డ్రైవర్లు పెద్ద సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చాంద్ , విజయ్ , మల్లేశ్ తదితరులున్నారు.

అక్రమ పైప్‌లైన్ ఏర్పాటు అడ్డగింత

నవీపేట,నవంబరు16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్ స్థలంలో శనివారం రాత్రి అక్రమంగా వేస్తున్న పైప్‌లైన్‌ను స్థానికులు అడ్డుకున్నారు. గ్రామ పంచాయతీకి చెందిన మార్కెట్ స్థలంతో పాటు పక్కనే పోస్టాఫీస్‌కు చెందిన ఖాళీ స్థలం ఉందని, ఈ స్థలాల గుండా ఓ కాంప్లెక్స్ యాజమాని అక్రమంగా పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్నాడని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయంపై డీపీవో, ఎంపీవోలతో పాటు పంచాయతీ కార్యదర్శులకు ఫోన్‌లో సమాచారం అందించడం జరిగిందని, అక్రమంగా వేసిన పైప్‌లైన్‌ను వెంటనే తొలగించాలని లేనట్లయితే తాము పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎంపీవో రామకృష్ణను వివరణ కోరగా మార్కెట్ స్థలంలో వేస్తున్న పైప్‌లైన్‌కు ఎటువంటి అనుమతులు లేవని వెంటనే సంబంధిత పైప్‌లైన్‌ను తొలగించడం జరుగుతుందని అన్నారు.

గోవిందా నామ స్మరణతో సకల శుభాలు

బోధన్‌రూరల్,నవంబరు16(ఆంధ్రజ్యోతి): కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి గోవిందా నామ స్మరణతో సకల శుభాలు కలుగుతాయని ఆలయ వేద పండితులు అన్నారు. కార్తీక మాసం శనివారాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి ఆలయంలో పల్లకి సేవ, ఊంజల్ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

చెరువులో చేప పిల్లల విడుదల

కోటగిరి,నవంబరు16(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని పలు గ్రామాలలో శనివారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను విడుదల చేశారు. మండలంలోని పొతంగల్, కల్లూర్, కొడిచర్ల, దోమలెడ్గి చెరువులలో 2.50లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు, తహసీల్దార్ మల్లయ్య, ఎంపీవో చందర్, మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ రాములు, నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి

బోధన్‌రూరల్,నవంబరు16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు బాలరాజ్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని ఇందూరు పాఠశాలలో ట్రస్మా జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన కొడాలి కిషోర్‌తో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బోధన్ డివిజన్ నాయకులు సాయికుమార్, నాగరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణం లోక కల్యాణం కోసమే

- కోటగిరిలో ఘనంగా అయ్యప్ప ఆలయ యాగశాల ప్రవేశం
- హాజరైన రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



కోటగిరిలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పోచారం



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పోచారం

కోటగిరి,నవంబరు16(ఆంధ్రజ్యోతి): ఆలయాల నిర్మాణం లోక కల్యాణం కోసమేనని, సంకల్పంతో పని చేస్తే సాధించలేనిది ఏది లేదని రాష్ట్ర వ్యవసాయ సలహదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో అయ్యప్ప, సాయిబాబా ఆలయాల యాగశాల ప్రవేశం శనివారం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అయ్యప్ప, సాయిబాబా ఆలయాల నిర్మాణానికి ప్రముఖ వ్యాపారవేత్త విఠల్ సెట్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో ఆలయాన్ని నిర్మించడం కోటగిరి గ్రామానికే గర్వకారణమన్నారు. సమాజంలో ప్రతీ ఒక్కరు దైవ భక్తిని అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో భక్తిభావన వెల్లువిరుస్తుందన్నారు. దేవుడి ఆశీర్వాదంతో బాన్సువాడ నియోజకవర్గంలో వ్యవవసాయం సుభిక్షంగా మారిందన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు బీర్కూర్ గంగాధర్, పోల అశ్విన్, నాయకులు పత్తి లక్ష్మణ్, విండో అధ్యక్షులు కూచి సిద్దు, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

● మత్స్య పారిశ్రామిక అభివృద్ధికి కృషి

వర్ని: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మత్స్య పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన కృషి చేస్తానని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం చందూర్ మండలం ఘన్‌పూర్ గ్రామంలో ఎఫ్‌డీఏఫ్ఎస్, డీఎఫ్ నిధులు రూ.15లక్షల వ్యయంతో నిర్మించిన నూతన భవనంను ఆయన ప్రారంభించారు. మత్స్యకారులు పెంచిన చేపలను దళారుల పాలు చేయకుండా గిట్టుబాటు ధరలకు అమ్ముకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం మత్స్య కార్మిక అభివృద్ధి కోసం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ అశోక్, లాలబోయి, సాయిరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వర్ని లబ్ధిదారులకు బిల్లులు పంపిణీ

వర్ని: వర్ని మండల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు శనివారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి బిల్లులను అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక్క బాన్సువాడ నియోజకవర్గంలోనే 11,500ఇళ్లను నిరుపేదలకు నిర్మించిన ఘనత తమదేనని ఎమ్మెల్యే ప్రశంసించారు. భారతదేశంలో ఎంతో మంది నాయకులు ఉన్న పేదలకు ఇళ్లు, విద్య, వైద్య రంగాల్లో కృషి చేసే వాడే నిజమైన నాయకుడని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ నాగేశ్వర రావు, నాయకులు వెలగపూడి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

● 7.51 కోట్ల డబుల్ ఇళ్ల బిల్లుల అందజేత

బాన్సువాడటౌన్: బాన్సువాడ నియోజకవర్గంలోని కోటగిరి,రుద్రూర్, వర్ని, చందూర్, నసురుల్లాబాద్, బీర్కూర్ , బాన్సువాడ మండలాల పరిధిలోని డబుల్ బెడ్ రూం ఇళ్లకు మంజూరైన బిల్లులను లబ్దిదారులకు శనివారం రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. సుమారు రూ.7.51 కోట్ల చెక్కులను పోచారం తన నివాసం వద్ద లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ప్రజాప్రతినిదులు, నాయకులు, అధికారులు ఉన్నారు.

ఏబీవీపీ నాయకుల ముందస్తు అరెస్టు

నవీపేట,నవంబరు16(ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఛలో బాసర ట్రిబుల్ ఐటీ కార్యక్రమంలో పాల్గొనకుండా ముందస్తుగా పలువురు ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా సరిహద్దు గ్రామామైన యంచలో ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. బాసర ట్రిబుల్ ఐటీలో జరుగుతున్న వరుస ఆత్మహత్యలపై న్యాయవిచారణ జరిపించాలని కోరుతూ ఏబీవీపీ నాయకుల ఛలో ట్రిబుల్ ఐటీ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న 13మంది ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా యంచ వద్ద పెద్ద ఎత్తున పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనాల తనిఖీ కార్యక్రమంలో నిజామాబాద్ అడిషనల్ ఏసీపీలు కోటేశ్వర్ రావు, బస్వారెడ్డి, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, నవీపేట ఎస్ఐ వినయ్, నిజామాబాద్ ఆరో టౌన్ ఎస్ఐ వెంకట్‌రావు, మోపాల్ ఎస్ఐ యాదగిరి గౌడ్, మాక్లూర్ ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది వాహనాల తనిఖీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:ఏబీవీపీ రాష్ట్ర పిలుపు మేరకు చలో బాసరా ట్రిబుల్ ఐటీ పిలుపు నివ్వగా శుక్రవారం అర్ధరాత్రి ఏబీవీపీ నాయకుల ఇళ్లలో మఫ్టీలో పోలీసులు చొరబడి ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ వర్సిటీ నాయకులు నాయ కులు నితిన్,నవీన్, అరెస్ట్ చేశారు. అలాగే బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేసి ట్రిపుల్ ఐటీకి వెళ్లకుండా ముందస్తుగా అడ్డుకున్నరని జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ తెలిపారు.బాసర ట్రిపుల్‌ఐటీలో జరుగుతున్న వరుస ఆత్మహత్య ల గురించి న్యాయ విచారణ జరిపించాలని బాసరా ట్రిబుల్ ఐటీ విద్యార్థులకు న్యాయం చే యాలని డిమాండ్ చేశారు. స్వాతి ప్రియ ఆత్మహత్యాపై విచారణ చేయించాలని డి మాండ్ చేశారు. బందీఖానను తలపిస్తున్న ట్రిబుల్ ఐటీ విద్యార్థులకు స్వేచ్ఛ కల్పించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా అందించి మెరుగైన హాస్టల్ వసతి కల్పించాలన్నారు. విద్యార్థి సంఘాల నాయకుపై రౌడీల ప్రవర్తించిన సీఎస్‌వో రాకేష్ పై క్రిమినల్ కేసుపెట్టాలని వర్సిటీ ఏబీవీపీ అధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు.

● అక్రమ అరెస్టులు ఉద్యమాన్ని ఆపలేరు

నిజామాబాద్ అర్బన్: ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఛలో బాసర త్రిపుల్ ఐటికి పిలుపునిస్తే అర్ధరాత్రి నుంచి పోలీసులు ఇండ్లలోకి చొరబడి ఏబివిపి నాయకులను అరెస్టులు చేయడం సరికాదని ఏబివిపి జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ అన్నారు. శనివారం బాసర త్రిబుల్ ఐటికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ఏబివిపి నాయకులను ఉదయం నుంచే బస్టాండ్‌ల వద్ద, రైల్వే స్టేషన్‌ల వద్ద ఆపి తనిఖీలు చేసి అరెస్టులు చేయడం సరికాదన్నారు. బాసర త్రిబుల్ ఐటిలో జరుగుతున్న ఆత్మహత్యలపై న్యాయవిచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. పోలీసుల నిర్బంధాలను దాటుకొని జిల్లా నుంచి అనేక మంది ఏబివిపి నాయకులు, కార్యకర్తలు బాసర త్రిబుల్ ఐటి గోడలు దూంకి ముట్టడి చేశారు.



యంచ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

భిక్కనూరు: బాసర ట్రిపుల్ ఐటీ ముట్టడికి వెళ్లకుండా భిక్కనూరు మండలంలోని ఏబీవీపీ నాయకులను శనివారం తెల్లవారుజామున ఏబీవీపీ నాయకుల ఇళ్లకు వద్దకు వెళ్లి భిక్కనూరు పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర నాయకులు గంధం సంజయ్ మాట్లాడుతూ బాసర ట్రిపుల్ ఐటీ వద్ద శాంతియుతంగా తమ ఆందోళన తెల్పుతుండగా ప్రైవేటు సెక్యూరిటీ ఏబీవీపీ నాయకుడు శ్రీనివాస్‌పై దాడిచేసి తీవ్రంగా గాయ ఎర్పడం సిగ్గుచేటన్నారు. అక్రమ అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేరని ఏది ఏమైనా కామారెడ్డి, మెదక్, నిజామాబాద్ జిల్లాల నుండి ట్రిపుల్ ఐటీ ముట్టడికి తరలివెళ్తున్నారని అన్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులపై జరుగుతున్న వేదింపులకు చరమగీతం పాడేవరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచే బీజేపీని బలోపేతం చేయాలి

ఆర్మూర్‌రూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచే భారతీయ జనత పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి గంగోని సంతోష్ అన్నారు. శనివారం ఆలూర్ మండ కేంద్రంలో బీజేపీ క్రియాశీల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా ప్రతీ ఐదేళ్ల కోసారి బీజేపీ పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు చేపడతామన్నారు. ప్రతీ కార్యకర్త సభ్యత్వ నమోదులో చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బండారి యాదగిరి, కొత్తూరు గంగాధర్, ప్రళయ్‌తేజ, మహేష్, కిషన్, రవికుమార్, నాగేష్, మల్లయ్య, హరిష్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

నవీపేట,నవంబరు16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తడగామ కాలనీకి చెందిన ముదాడెం హన్మాండ్లు(39)అనే వ్యక్తి స్థానిక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ వినయ్ తెలిపారు. ఇటీవల మద్యానికి బానిసైన హన్మాండ్లు శుక్రవారం సాయంత్రం స్థానిక చెరువులో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన అతడు తిరిగి ఇంటికి చేరుకోలేదన్నారు. చెరువు కట్టపై బట్టలు, చెప్పులు కనిపించడంతో శనివారం జాలర్లతో గాలించగా హన్మాండ్లు మృతదేహం లభ్యమైందని ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య రూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మాల సింహగర్జనను విజయవంతం చేయాలి

బోధన్‌రూరల్,నవంబరు16(ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 1న హైదరాబాద్‌లో జింకానా నగరంలో చేపట్టనున్న మాల సింహగర్జనను మాలలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాల మహనాడు జిల్లా అధ్యక్షులు ఆనంపల్లి ఎల్లమయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అలుక కిషన్, ఎడ్ల నాగరాజు, సాలూర పాండు, ఈశ్వర్, రామకృష్ణ, మాల మహనాడు బోధన్ అధ్యక్షులు బాల్‌రాజ్, జిల్లా నాయకులు, ముఖ్య నేతలు తదితరులు పాల్గొన్నారు.

నల్లవెల్లికి నాలుగు కోట్ల నిధులు మంజూరు

ఇందల్వాయి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లవెల్లి గ్రామానికి ఆర్అండ్‌బి నిధులతో 4కోట్లు మంజూరు అయ్యాయి. సిర్నాపల్లి ఆర్అండ్‌బి రోడ్ నుండి మల్లయ్య గుడి వరకు డబుల్ రోడ్ కొరకు నిధులు మంజూరు అయ్యాయని వీడీసీ సభ్యులు తెలిపారు. శనివారం రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. నల్లవెల్లి గ్రామానికి నిధులు మంజూరు చేసిన రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి వీడీసీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలి

ఆర్మూర్‌రూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెర్కిట్ సొసైటీ చైర్మన్ బోజారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సాయిబాబాగౌడ్, అజ్జుబాయి, అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

బోధన్‌రూరల్,నవంబరు16(ఆంధ్రజ్యోతి): బోధన్ స్టేషన్ ప్రాంగణంలో జరిగిన ఘర్షణలో భాగంగా ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు బోధన్ పట్టణ ఇన్‌చార్జి సీఐ విజయ్ బాబు తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాకాసిపేట్ ప్రాంతానికి చెందిన సుశీల అనే మహిళ లక్ష్మిపై ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు ఇరువురిని పోలీస్ స్టేషన్‌కు విచారణ నిమిత్తం రప్పించామన్నారు. ఇరువురు కుటుంబాల వారు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోనే మాపై కేసులు పెడతావా అంటూ గొడవకు దిగారని దీంతో పోలీసులు వారిని నచ్చజెప్పే ప్రయత్నం చేశారన్నారు. వినకపోవడంతో లాఠీలతో బెదిరించి గొడవను సద్దుమణిగించామని తెలిపారు. ఈ ఘటనలో పెద్ద సాయిలు, చిన్న సాయిలు, నడ్పి సాయిలుపై కేసు నమోదు చేశామన్నారు. ఫిర్యాదుదారులు లక్ష్మి, సుశీల ఇద్దరు బంధువులేనన్నారు.

పట్టుదల ఉంటే కానిది లేదని నిరూపించారు

రామారెడ్డి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టుదల ఉంటే కానిది లేదని నిరూపించారు యువకులు. రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు, ఇసన్నపల్లి గ్రామానికి చెందిన ఓ యువతి గ్రూపు-4 పరీక్షల ఫలితాల్లో విజయం పొందారు. గ్రూపు-4 ఫలితాల్లో విజయం సాధించిన యువతి, యువకులు విజయం సాధించారు. రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన అంధోల్ నితేష్ కుమార్, ఆకుల విష్ణు గుప్త, ఇసన్నపల్లి గ్రామానికి చెందిన ఎర్ర ప్రియాంకలు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూపు-4 పరీక్ష ఫలితాల్లో విజయం సాధించారు. కష్టపడి చదివి ఉన్నత ఫలితాలు సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందుతున్న యువతకు కన్న తల్లిదండ్రుల పేరు ప్రఖ్యాతలు నిలబెడుతున్నందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు. రాబోయే రోజుల్లో అర్హత గల యువకులు మరిన్ని ఉద్యోగాలు సాధించాలని గ్రూపులతో పరీక్షలకు ఎంపికైన వారిని చూసి ఇతర యువత యువకులు రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలని రాజకీయ నాయకులు, వ్యాపారులు పేర్కొన్నారు.

గ్రూప్-4లో సత్తా చాటిన ధర్పల్లి యువకుడు

ధర్పల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మర్రిపెద్ది రాహుల్ గ్రూప్-4లో సత్తా చాటారు. గ్రామానికి చెందిన రాహుల్ పట్టువదలని విక్రమార్కుడిలా చదివి ఆదర్శంగా నిలిచాడు. జిల్లా కేంద్రంలోగల కలెక్టర్ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సంపాదించాడు. ఉద్యోగం రావడంతో రాహుల్ తల్లిదండ్రులు రాజు, లక్ష్మిలు సంతోషం వ్యక్తం చేశారు. కష్టపడి చదివిన దానికి ఫలితం దక్కిందన్నారు. గ్రూప్-4లో ఉద్యోగం సాధించడంపై గ్రామ యువకులు అభినందించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు జక్రాన్‌పల్లి, పడకల్ విద్యార్థుల ఎంపిక

జక్రాన్‌పల్లి, నవంబరు16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు జక్రాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుకుంటున్న శ్రీహరి ప్రసాద్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లింగన్న తెలిపారు. మెదక్ జిల్లా చేగుంటలో ఈనెల 16, 17, 18తేదీలలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో శ్రీహరి ప్రసాద్ పాల్గొంటారని తెలిపారు.

రోడ్డుపై ప్రమాదకరంగా గుంత



చెరువుకట్టపై ఉన్న గుంత

వేల్పూర్,నవంబరు16(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ గ్రామ సమీపంలో బుడిగెడు చెరువుకట్ట కింద ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మరింది. గత నాలుగు రోజుల క్రితం ఈ రోడ్డుపై కల్వర్టు వద్ద ఈ గుంత బుంగ ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ బుంగను పూడ్చడానికి సంబంధిత అధికారులు ఏలాంటి చర్యలు తీసుకోవడంలేదని ప్రయా ణికులు వాపోతున్నారు. రాత్రి సమయంలో ఈ రోడ్డు వెంట వెళ్ళే వాహనదారులు గుంతలో పడి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు ప్రమాదకర గుంతను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నగరేశ్వర ఆలయాభివృద్ధికి విరాళాలు



బీర్కూర్‌లో విరాళం అందజేస్తున్న దృశ్యం

బీర్కూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని శ్రీ నగరేశ్వర ఆలయ అభివృద్ధి కోసం భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలను అందజేస్తున్నారు. బీర్కూర్ మండల కేంద్రంలో పురాతన నగరేశ్వర ఆలయం శిథిలావస్థకు చేరడంతో కమిటీ సభ్యులు ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 15 లక్షల వ్యయంతో ఆలయాన్ని పునఃనిర్మించి ప్రారంభించారు. ఇదిలా ఉండగా భక్తులు ఆలయ అభివృద్ధి కోసం భారీగా విరాళాలు అందజేస్తున్నారు. శనివారం ఇబ్రహీంపేట్‌కు చెందిన నాగులూరి శ్రీనివాస్ అనే భక్తుడు రూ.11 వేల 116 విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌కు శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కర్నకంటి ప్రవీణ్‌కుమార్, కందుకుర్తి సంతోష్, దారం నాగరాజు, కొట్టూరి సాయి స్వరూప్,మహాజన్ కుమార్,ప్రవీణ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మంత్రిని, ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



మంత్రి కలిసిన బాల్కొండ నియోజకవర్గ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు

వేల్పూర్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపెల్లి కృష్ణరావు, బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిలను శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డితో ఆధ్వర్యంలో బాల్కొండ నియోజకవర్గంలోని వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలిశారు. బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరు కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపెల్లి కృష్ణరావు, బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిలు కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మెండోర, వేల్పూర్, బాల్కొండ, కమ్మర్‌పల్లి, ముప్కాల్, భీమ్‌గల్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, గడ్డం నర్సారెడ్డి, వెంకటేష్‌గౌడ్, రవి, స్వామి కలిసి వారిలో ఉన్నారు.

కుక్కదాడిలో బాలుడికి తీవ్రగాయాలు



గాయపడిన బాలుడు

కమ్మర్‌పల్లి, నవంబరు 16:(ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో శనివారం సాయంత్రం కుక్కదాడిలో బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. మండలకేంద్రంలోని పోచమ్మ ఆలయవీదిలోని ఇంట్లో ఉంటున్న సంపంగా నాగరాజు కుమారుడు సంపంగా నాగశుషాంత్ (3)అనేబాలుడు శనివారం సాయంత్రత మ ఇంటిముందు ఆడుకుంటున్న సమయంలో అటుగా వెలుతున్న కుక్క ఒక్కసారిగాబాలుడిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చింతి బాలుడి ముఖంపై తీవ్రంగా గాయపర్చింది బాలుడి అరుపులకు ఇంట్లో నుండి కుటుంబసభ్యులు పరుగెత్తుకువచ్చి కుక్కను తరమడంతో పారిపోయింది. తీవ్రంగా గాయపడ్డ బాలుడిని నిజామాబాద్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. గుంపులుగా ఉడే కుక్కలను ఇటీవలే స్థానిక గ్రామ పంచాయితి సిబ్బంది నియంత్రించినప్పటికి మరోకొన్ని కుక్కల మిగిలిపోయి దాడులకు పాల్పడుతున్నాయని వాటిని సైతం నియంత్రించాల్సిన అవసరముందని స్థానికులు కోరుతున్నారు.

అంబులెన్స్ బోల్తా

ఎడపల్లినవంబరు16(ఆంధ్రజ్యోతి):ఎడపల్లి మండలంలోని ఎమ్మెస్సీ ఫారం గ్రామంలో ఆంబులెన్స్ బోల్తాపడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ నుంచి బోధన్ వెళ్తున్న ఓ ప్రవేటు అంబులెన్స్ అతివేగంగా ఎమ్మెస్సీ ఫారం గ్రామంలోని మలుపు వద్ద రోడ్డు ప్రక్కన ఉన్న బండరాయిని ఢీకొని ఒక్కసారిగా బోల్తా పడింది. సంఘటన జరిగిన సమయంలో అంబులెన్స్‌లో డ్రైవర్ ఒక్కరే ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో అంబులెన్స్ డ్రైవర్ అరుణ్‌కు గాయాలు కాగా స్థానికులు అతనిని ఆసుపత్రికి తరలించారు.

గల్ఫ్‌లో తప్పిపోయిన వ్యక్తి క్షేమంగా ఇంటికి

ఆర్మూర్‌రూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): గత నెల దుబాయిలో పని చేయడానికి వెళ్లి అక్కడ తప్పిపోయిన నిర్మల్ జిల్లా మాడేగావ్‌కు చెందిన సురేష్ క్షేమంగా ఇంటికి చేరారు. సురేష్ తప్పిపోగానే ఆయన కుటుంబసభ్యులు ఆర్మూర్‌లోని ప్రవాస భారతీయులు, హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడును కలిసి తన భర్తను స్వగ్రామానికి రప్పించాలని కోరారు. కోటపాటి దుబాయిలోని ఇండియాన్ కన్సోలేట్ అధికారులు సంబంధిత కంపెనీ అధికారులతో మాట్లాడి భారతీయ హక్కుల సంక్షేమ వేదిక కోఆర్డినేటర్ జంగం బాల కిషన్ సురేష్ ఆచూకీ కనుగొని ఇండియాకు రప్పించారు. తమ కుటుంబ సభ్యున్ని క్షేమంగా ఇంటికి రప్పించేందుకు కృషి చేసిన కోటపాటి, జంగం బాలకిషన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్గుల్‌లో చెట్లు కోసే మిషన్ అందజేత

జక్రాన్‌పల్లి, నవంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో అర్గుల్ గ్రామంలో శనివారం గ్రామపంచాయతీ వద్ద జక్రాన్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బందికి చెట్లు కోసే మిషన్‌ను తాజామాజీ సర్పంచ్ గోర్త పద్మ రాజేందర్ అందజేశారు. ఈ చెట్లు కోసే మిషన్‌ను ఏడీ ప్రవీన్‌కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో లైన్ ఇన్‌స్పెక్టర్ జావిద్, లైన్‌మెన్ వసంత్, వీడీసీసభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పలువురి పరామర్శ

డోమకొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):డోమకొండ మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ తల్లి తీగల సత్తమ్మ గత రెండు రోజుల క్రితం మరణించింది. విషయం తెలుసుకున్న వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎల్లారెడ్డి, అనంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు, శ్రీలత, సంతోష్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సత్తమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. పాల్గొన్నారు.కార్యక్రమంలో తీగల సుదర్శన్‌గౌడ్, పందిరి మధుసుదన్‌రెడ్డి, సీతారాం మధు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



● తాడ్వాయి బస్టాండ్‌లో చెత్తాచెదారం ఇలా..


ఆంధ్రజ్యోతి ఫోకస్

రూ.లక్షలు పెట్టారు..
లక్షణంగా వదిలేశారు!

● వృథాగా మారిన తాడ్వాయి ప్రయాణ ప్రాంగణం ● అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా బస్టాండ్
● అయినా.. పట్టించుకోని స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు



వృథాగా ఉంటున్న తాడ్వాయి ప్రయాణ ప్రాంగణం



పెచ్చులూడిన తాడ్వాయి బస్టాండ్ పైకప్పు

తాడ్వాయి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డికి ఐదు కిలో మీటర్ల దూరంలోనే తాడ్వాయి మండలం ఉంది. మండలంలో ప్రయాణ ప్రాంగణం గత 15 సంవత్సరాలుగా వృథాగా ఉంటుంది. ప్రభుత్వం కొన్ని లక్షల రూపాయలతో ప్రయాణ ప్రాంగణాన్ని నిర్మించి లక్షణంగా వదిలేశారు. అనునిత్యం కామారెడ్డి, ఎల్లారెడ్డి, నిజాంసాగర్ బస్సులు వందల సంఖ్యలో తాడ్వాయి మీదుగా వెళుతుంటాయి. కానీ, బస్టాండ్‌లోకి మాత్రం వెళ్లక.. కింది నుంచే వెళ్లి పోతూ ఉండడం గమనార్హం. అటు అధికారులు, నాయకులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉంది. బస్సుల కోసం రోడ్డుపైనే వేసి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు, గ్రామస్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వృథాగా ఉంటున్న బస్టాండ్ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. మందుబాబులకు అడ్డాగా మారిందంటున్నారు. మూగ జీవాలు కూడా రోజు దర్శనమిస్తున్నాయి. ప్రయాణ ప్రాంగణం వాడకపోవడంతో పెచ్చు లూడి శిథిలావస్థకు చేరుకుంది. ఆర్టీసీ డ్రైవర్లు బస్టాండ్ పక్క నుంచే వెళుతున్నా.. బస్టాండ్‌లోకి పోకపోవడం విడ్డూరంగా ఉందని ప్రయాణికులు అంటున్నారు. ఇకనైనా అధికారులు, నాయకులు స్పందించి ప్రయాణ ప్రాంగణాన్ని ఉపయోగపడేటట్లు చూడాలని ప్రయాణికులు, గ్రామస్థులు అంటున్నారు. ప్రయాణ ప్రాంగణం ముందరనే శబరిమాత ఆశ్రమం ఉంది. ప్రయాణ ప్రాంగణాన్ని అందుబాటులోకి తీసుకువస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుందని గ్రామస్థులు అంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రయాణ ప్రాంగణంలోకి బస్సులు నిలిపేటట్లు చేయాలని ప్రయాణికులు అంటున్నారు. రోడ్డుపైనే ప్రయాణికులు నిలుచుండటంతో ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయని అంటున్నారు. దీనికి సంబంధించి అటు నాయకులు, అధికారులు స్పందించి ప్రయాణ ప్రాంగణంలోకి బస్సులు నిలిపేటట్లు చూడాలని అన్నారు.

వృథాగా ప్రయాణ ప్రాంగణం
: ఎం.నర్సింలు, ప్రయాణికుడు, తాడ్వాయి



తాడ్వాయిలో ప్రయాణ ప్రాంగణం వృథాగా ఉంటుంది. దీనికి సంబంధించి సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రయాణ ప్రాంగణలోకి బస్సులు వెళ్లేలా చూడాలి.

రోడ్డుపైనే ప్రయాణికుల ఎదురుచూపు
: రాఘవరెడ్డి, ప్రయాణికుడు, తాడ్వాయి



ఆర్టీసీ బస్సులను బస్టాండ్ లోనికి పోకుండా ఉండటంతో రోడ్డుపైనే ప్రయాణికులు వేచి చూడాల్సి వస్తుంది. అంతేకాకుండా బస్సుల కోసం వేచి చూసే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రయాణ ప్రాంగణంలో బస్సులు నిలిపే విధంగా చూడాల్సిన అవసరం ఉంది.

మరమ్మతుల కోసం అధికారులకు నివేదిక పంపాం
: ఇందిరా, ఆర్టీసీ డిపో మేనేజర్, కామారెడ్డి జిల్లా

తాడ్వాయిలోని ప్రయాణ ప్రాంగణానికి సంబంధించి మరమ్మతులకు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు నివేదికలు పంపడం జరిగింది. బస్టాండ్‌ను త్వరలోనే ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా చూస్తాం. అంతేకాకుండా బస్టాండ్ ఆవరణ నుంచి విద్యుత్ లైన్ వెళ్లడంతో.. కొద్దిగా ఇబ్బంది ఉంది, దీనిని త్వరలోనే ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తాం.

భక్తి.. సమాచారం!!



లింబాద్రిగుట్టపై పుష్కరిణిలో స్వామివారికి స్నానం ఆచరింపజేస్తున్న వేద పండితులు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

పుష్కరిణి వద్ద స్వప్న తిరుమంజనం

● లింబాద్రిగుట్టపై ఘనంగా పుష్పయాగం

భీమ్‌గల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పవిత్ర పుణ్య క్షేత్రమైన లింబాద్రి గుట్టపై కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం 10వ రోజు ఆలయ ధర్మకర్త నంబి వంశస్థులు శేషహోమం, స్వప్న తిరుమంజనం కార్యక్రమాన్ని చేపట్టారు. శాస్త్ర నిధి ననుసరించి భగవంతునికి స్నానమాచరింప చేయుటకు శేష హోమం మిగిలిన అనంతరం అర్చకులు లక్ష్మీనర్సింహ స్వామి ఉత్సవ మూర్తులను పల్లకీలో మంగళవాయిద్యాలు మోగుతుండగా.. పుష్కరిణి మంటపం పైకి తీసుకొచ్చి పంచ కలశములను ప్రతిష్ఠింపజేసి పసుపు కలిపిన జలముతో ఉత్సవమూర్తులకు అభిషేకాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ మూర్తులకు పసుపుబొట్టు సమర్పించడం వల్ల భక్తులకు శుభ కలుగుతుందని శాస్త్రం చెబుతోంది. స్వప్న తిరుమంజనం జరుగు సమయంలో శ్రీభాగవతి ఫలశృతి నిర్వహించారు. ఈ సందర్భంగా శీమద్భాగవత పారాయణాన్ని చదివి వినిపించారు.

ఘనంగా చక్ర తీర్థం

ఉత్సవాలలో భాగంగా మధ్యాహ్నం చక్ర తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. విష్ణమూర్తి యొక్క దివ్యాయుధమైన కోటి సూర్యులతో సమానమైన శ్రీసుదర్శన చక్రస్వామిని పుష్కరిణిలో స్నానమాచరింపజేశారు. అట్టి జలమును భక్తులందరు తమ శిరమున ధరించినచో ఆనందము, ఐశ్వర్యము పొంది దరని అర్చకులు తెలియజేశారు. అనంతరం రాత్రి పుష్పయాగం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సంతానం లేని మహిళలకు అర్చకులు పోలు ధారాన్ని మరుసటి రోజు ఉదయం డోల సేవ జరిగిన తర్వాత అందజేస్తారు. చక్రతీర్థం పురస్కరించుకొని లింబాద్రిగుట్ట బంజరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



శేష వాహనంపై దర్శనమిస్తున్న లక్ష్మీనర్సింహస్వామి

శివనామ స్మరణతో మార్మోగిన పలుగుట్ట

● కేదారేశ్వర ఆశ్రమంలో మహరాజ్ ఆశీస్సుల కోసం బారులు తీరిన భక్తులు ● ప్రతీ ఒక్కరికి విబూతి ఇచ్చిన మంగి రాములు ● అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న వేలాది మంది భక్తులు

నందిపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని శ్రీకేదారేశ్వర ఆశ్రమం(పలుగుట్ట) భక్తుల శివనామ స్మరణంతో మార్మోగింది. విజయదశమి(దసరా) సందర్భంగా దీక్ష చేపట్టిన ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహరాజ్ గురువారం కార్తీక పౌర్ణమిన అర్ధరాత్రి దీక్ష విరమించడంతో శనివారం జాతర ఉత్సవాలు జరిగాయి. కాగా, మహరాజ్ ఆశీస్సుల కోసం భక్తులు తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. క్యూలో ఉన్న భక్తులకు నేరుగా ఒక్కొక్కరికి మహరాజే విబూది పెట్టి ఆశీర్వదించారు. కట్నా, కానుకలు సమర్పించుకున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, హైదరాబాద్, మహబూబ్ నగర్, వరంగల్, నల్గొండ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. అంతేకాకుండా మహరాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి సైతం భక్తులు రెండు, మూడు రోజుల ముందే రావడం గమనార్హం. ఆలూర్, బాద్గుణ, మారంపల్లి, తదితర గ్రామాల నుంచి వచ్చిన భజనకారులు భక్తులకు కనువిందు చేశారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు, కళాశాలలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులు, యువజన సంఘాలు, రైతు సంఘాల సభ్యులు, వ్యాపారస్తులు వలంటీర్లుగా పని చేశారు. అంతే కాకుండా మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటీసీ సభ్యులు, వివిధ శాఖల ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు భక్తులకు సేవ చేసుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో సుమారు 50 వేలకు పైగా భక్తులు పాల్గొన్నారు. ఎస్సై ఏ.హరిబాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వారు సైతం భక్తుల సేవలో తరించారు.



దీక్ష నుంచి బయటకు వస్తున్న మహరాజ్‌కు నమస్కరిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, కుటుంబ సభ్యులు



భక్తులను ఆశీర్వాదిస్తున్న మంగి రాములు మహరాజ్



జాతర ఉత్సవాలలో పాల్గొన్న భక్తులు



మంగి రాములు మహరాజ్ ఆశీర్వాదం తీసుకుంటున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజారెడ్డి

ఆర్మూర్ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నందిపేట మండల కేంద్రంలోని శ్రీకేదారేశ్వర ఆశ్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు, అలాగే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ శ్రీకేదారేశ్వర ఆశ్రమం భక్తికి నిలయంగా మారిందని పేర్కొన్నారు. ప్రతీ హిందువు ప్రతీ రోజు పూజలు చేయడం అలవర్చుకోవాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంరతం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహరాజ్ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మహరాజ్‌ను శాలువాతో సన్మానించారు.

ప్రకటనలే తప్ప.. పనుల ప్రారంభం ఎప్పుడు?

● తెలంగాణ యూనివర్సిటీలో బాలికలకు వసతి కరువు ● ఇరుకుగా మారిన హాస్టల్ ● ఒకే భవనంలో 500మందికి వసతి
● 300మందికి సరేపోయే భవనంలో.. 500 మంది విద్యార్థులకు వసతి ● తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు

జర దేఖో!!



● టీయూ బాలికల హాస్టల్ ఇదే..



● టీయూ కళాశాల భవనం

డిచ్‌పల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణకు ముందే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం పేరుతో ఉన్న ఏకైక యూనివర్సిటీ ఈ డిచ్‌పల్లి తెలంగాణ యూనివర్సిటీ. ఇంత ఘనమైన పేరున్న ఈ విశ్వ విద్యాలయంలో బాలికలకు తీవ్రమైన వసతి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రం అవతరించి 10ఏళ్లు గడిచిన వర్సిటీలో బాలికల వసతి సమస్య. నేటికీ తీరాడం లేదంటున్నారు. ఈ విషయమై ఎన్నో సార్లు ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు, రాష్ట్ర గవర్నర్‌కు వినతి పత్రాలు విద్యార్థులు అందించినా.. సమస్య పరిష్కరం కావడం లేదు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విద్యార్థినులు ఇక్కడికి పీజీ, ఉన్నత చదువుల కోసం వస్తుంటారు. గత ఐదు సంవత్సరాల కాలంగా ఈ హాస్టల్ సమస్య తీవ్రంగా వేధిస్తున్నా.. ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి స్పందించక పోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పీజీ కోర్సుల్లో అన్ని విభాగాల్లో విద్యార్థినులే అధిక శాతం సీట్లు పొందగా.. వంద శాతం సీట్లలో 72 మంది విద్యార్థినులే సీట్లు సాధిస్తున్నారని వర్సిటీ అధికారులే చెబుతున్నారు. వర్సిటీలోని బాలికల హాస్టల్‌లోని ఒక్కో గదిలో 5నుంచి ఆరుగురు విద్యార్థినులు ఉండాల్సి ఉండగా.. ఏకంగా 10 నుంచి 15మందిని సర్దుబాటు చేసుకుంటున్నారు. తెలంగాణ యూనివర్సిటీలో 1851 మంది విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరగా.. అందులో 1226 మంది బాలికలు పీజీ కోర్సులో ప్రవేశం పొందారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పీజీ కోర్సుల్లో బాలికలు ఎక్కువగా చేరుతుండటంతో హాస్టల్ అకాంబిడేషన్ ఇబ్బందిగా మారుతోంది. దీంతో యూనివర్సిటీ అధికారులు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులో చేరే విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించకుండా ఒత్తిడిని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. గత పదేళ్ల క్రితం 300 మంది కోసం నిర్మించిన బాలికల హాస్టల్‌లో ప్రస్తుతం 500 మంది ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కెమిస్ట్రీ, తెలుగు, ఇతర డిపార్టుమెంట్‌లలో 30 నుంచి 60 సీట్లకు పెంచిన హాస్టల్ వసతి మాత్రం పెంచడం లేదని, దీంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని పలువురు విద్యార్థినులు వాపోతున్నారు. గతంలో విశ్వవిద్యాలయాన్ని మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సందర్శించిన సమయంలో విద్యార్థులు బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని తమ గోడును వెళ్లబోసుకున్నారు. వెంటనే సమస్య పరిష్కరించేందుకు స్వయంగా హాస్టల్ సందర్శించిన గవర్నర్ హామీ ఇచ్చి ఏడాదిన్నర గడిచిన ఇంత వరకు హస్టల్ వసతి నిర్మాణానికి ముందడుగు పడకపోవడంతో విద్యార్థినులకు సమస్యలు అధికమయ్యాయి. కావున ఇప్పటికైనా జిల్లా శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, పార్లమెంట్ సభ్యుడు వసతి గృహం ఏర్పాటు పట్ల ప్రత్యేక చొరవ చూపాలని విద్యార్థినులు కోరుతున్నారు.

మంజూరైందని చెబుతున్నారే తప్ప..

తెలంగాణ యూనివర్సిటీకి బాలికల హాస్టల్ మంజూరు అయ్యిందని గత వీసీ, ప్రస్తుత వీసీ యాదగిరి రావులు చెబుతున్న ఇంత వరకు పనులు ప్రారంభం కావడం లేదు. ప్రస్తుత వీసీ యాదగిరిరావు మాట్లాడుతూ.. రూస ద్వార హాస్టల్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలో టెండర్‌లు పిలుస్తామని చెప్పారు. కానీ ఆ వైపు ముందడుగు పడటం లేదని, చాలా రోజుల నుంచి అధికారులు ఇలాంటి ప్రకటనలు చేస్తూ.. కాలయాపన చేస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

దాడిని ఖండించిన విద్యుత్ ఉద్యోగ జేఏసీ



నగరంలో నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

సుభాష్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై, జిల్లాకు చెందిన అసిస్టెంట్ లైన్‌మెన్ నవీన్‌పై దాడులను ఖండిస్తూ విద్యుత్ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో భోజన విరామం సమయంలో నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని పవర్‌హౌజ్ కంపౌండ్ కార్యాలయంలో నల్లబ్యాడ్జీలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ రవీందర్ హాజరై మాట్లాడుతూ అధికారులపై దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. బోధన్ మండలం సంఘం గ్రామంలో పనిచేస్తున్న అసిస్టెంట్ లైన్‌మెన్ నవీన్‌పై దాడి చేయడం ఆటవిక చర్య అని అన్నారు. వికారాబాద్ జిల్లాలో కలెక్టర్, రెవెన్యూ అధికారులపై గ్రామస్తుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సిబ్బంది గ్రామాల్లో 24గంటలు పనిచేస్తూ రెవెన్యూ వసూళ్లకు వచ్చినప్పుడు ఊట్‌పల్లి గ్రామానికి చెందిన మహిళ అధికారిపై తీవ్రంగా దాడి చేసి గాయపర్చడం సరైందికాదన్నారు. దాడి చేసిన మహిళపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అసిస్టెంట్ లైన్‌మెన్‌కు యాజమాన్యం అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రఘునందన్, గంగా ధర్, తోటరాజశేఖర్, రమేష్, వెంకటరమణ, సురేష్‌కుమార్, రాజేందర్, నాంపల్లిగంగారాం నాయక్, చంద్రశేఖర్, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

గంజ్ నుంచి దుబ్బా రైల్వే గేట్ మూసివేత

● 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు

ఖిల్లా, నవంబరు16(ఆంధ్రజ్యోతి): నగరంలోని గంజ్ నుంచి దుబ్బా వెళ్లే లలితామహల్ థియేటర్ సమీపంలోని 192వ నంబర్ రైల్వేగేట్‌ను మంగళవారం తెల్లవారుజాము 19 నుంచి 21వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు రైల్వే శాఖ సీనియర్ సెక్షన్ ఇంజనీరింగ్ విభాగం అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ రెండు రోజుల పాటు గేటు పరిసర ప్రాంతాల్లో మరమ్మత్తు పనులు ఉండడం వల్ల గేట్‌ను మూసివేస్తున్నట్లు తెలిపారు. అటుగా వెళ్లే వాహనదారులు శివాజీచౌక్ పక్కన గల ఫ్లైఓవర్‌బ్రిడ్జి ద్వారా వెళ్లాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సంబంధిత పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు సైతం పోలీసు, రైల్వే శాఖకు సహకరించాలని కోరారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌తో పాటు పోలీసు ఉన్నతాధికారులకు, ఆయా పోలీసుస్టేషన్ ఎస్ఐలకు సమాచారం నిమిత్తం తెలియజేయడం జరిగిందన్నారు.

'ఆలయాల వద్ద రాజకీయాలు మానుకోండి'



మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): లింబాద్రి గుట్ట రథోత్సవానికి భక్తులు అధికంగా రావడం, కొంతమంది భక్తులు రథోత్సవాన్ని చూడాలనే తొందర్లో వాహనాల ను రోడ్డుకు ఇరువైపులా పెట్టడం వల్ల మరో ముగ్గురు రాంగ్‌రూట్‌లో రావడం వల్ల శుక్రవారం జరిగిన రథోత్స వంలో ట్రాఫిక్ జామ్ కారణమైందని కానీ కాంగ్రెస్ నాయకులను పంపి తనను పంపలేదని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడటం సరికా దని ఆలయాల వద్ద నీచ రాజకీయాలను మానుకోవాలని జిల్లా కాం గ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మో హన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రథోత్సవానికి రాష్ట్ర టీజీఎండీఎస్ చైర్మన్ ఈర వత్రి అనిల్, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి, తాను సైతం రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లిన సంగతి ప్రశాంత్‌రెడ్డి తెలుసుకొని మా ట్లాడాలన్నారు. దేవుని కోసం మనం వెళ్లాలి కానీ మన కోసం దేవుడు ఆగడని ఇది ప్రశాంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు.ఆలయాల వద్ద నీచ రాజకీయాలు చేయడం ప్రశా ంత్‌రెడ్డి మానుకోవాలని ఆయన సూచించారు.

మైనార్టీలకు ఉచిత కోచింగ్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో విదేశాలలో ఉన్నత చదువులు చదవడానికి ఐఈఎల్‌టీఎస్,జీఆర్ఈ, టోఫెల్ పరీక్షలకు ఉచిత శిక్షణ కొరకు జిల్లాలోని అర్హులైన మైనార్టీలు (ముస్లీం, క్రిస్టియన్, సిక్, జైన్, బౌద్ధ, పార్సి) అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మైనార్టీఅధికారి నాగోరావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు హైదరాబాద్‌లోని అబిడ్స్‌లో గల రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్‌లో రిజిస్ట్రేషన్‌లు చేసుకోవచ్చని ఇతర వివరాలకు 040-23236112 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. అన్ని విద్యా పత్రాల జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫోటోలు-2, ఆధార్‌కార్డు దరఖాస్తుతో జతచేయాలని ఈ అవకాశాన్ని జిల్లాలోని మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిల్లా గ్రంథాలయంలో విద్యార్థులకు జీకే పోటీలు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన శనివారం రోజు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ పోటీలను నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పోటీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగరంలో రక్తదాన శిబిరం

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు 20 మంది రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దినేష్‌ఠాకూర్, జిల్లా కార్యదర్శి ద యానంద్, దాత్రిక రమేష్, నాంపల్లి శేఖర్, భజరంగ్‌దళ్ జిల్లా సహ సంయోజక్ మహేష్, నగర సహసంయోజక్ సురేష్, సాయి, తరుణ్, పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఆటలు ఆడాలి

● ఆటలు మానసిక ఒత్తిడిని దూరం చేస్తాయి ● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సుభాష్‌నగర్,నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు తమ దైనందిన జీవితంలో క్రీడలను భాగంగా చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ క్రీడా పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఒత్తిడిని దూరం చేస్తూ శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడానికి ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. సహృద్భావ వాతావరణానికి బాటలు వేస్తాయని అన్నారు. అనునిత్యం వివిధ కార్యకలాపాలతో నిమగ్నమై ఉండే వివిధ వర్గాల వారికి మానసికోల్లాసాన్ని అందించేందుకు క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయని అన్నారు. ఈ దిశగా ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈతరం వారు ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యతను ఇస్తూ క్రీడలు, వ్యాయామాలు, యోగా వంటి అభిరుచులను అలవర్చుకుంటున్నారని ఇది ఆహ్వానించదగ్గ పరిణామమని అన్నారు. గతంలో ఆఫీసర్స్‌క్లబ్‌లో సభ్యత్వం అంటేనే ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించబడేదని అన్నారు. దీని ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆఫీసర్స్‌క్లబ్ అభివృద్ధికి తనవంతు తోడ్పాటును అందిస్తానని తెలిపారు. అనంతరం రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ ఆఫీసర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్ మాట్లాడుతూ క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారని అన్నారు. నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్‌కు స్విమ్మింగ్ పూల్ మంజూరు చేయించేందుకు యంత్రాంగం తరఫున ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌ను కోరారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, జిల్లా టీజీవో సంఘం అధ్యక్షుడు అలుక కిషన్, ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి చిలువేరి సత్యనారాయణ, వెంకట్రాములు, గంగాకిషన్, అంగిరేకుల సాయిలు, ఏటీఎస్ శ్రీనివాస్, కెప్టెన్ అకాడమి చైర్మన్ అర్వింద్, మురళి, సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

● కొనుగోలు కేంద్రం పరిశీలన

నిజామాబాద్ అర్బన్: మాక్లూర్ మండలం మానిక్‌భం డార్‌లో మెప్మా ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గా ంధీ హన్మంతు శనివారం పరిశీలించారు. రైతు లు తెచ్చిన ధాన్యాన్ని పరిశీలించి ఇప్పటి వరకు ఎంత పరిమాణంలో ధాన్యం సేకరించారు, రైస్ మిల్లులకు ఎంత తరలించారు తదితర వివ రాల ను అడిగి తెలుసుకున్నారు. మిల్లర్ల వద్ద ఏమైనా ఇబ్బందులు ఎదురవుతు న్నాయా అని ఆరా తీశారు. ఎక్కడ కూడా తరుగు, కడ తా పేరుతో కోతలు విధించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గన్నీ బ్యాగుల కొరత నెలకొనకుండా చూడాలని, నిర్దేశిత మిల్లులకు వెంట వెంటనే ధాన్యం తరలింపు కోసం లారీలు అందుబాటులో ఉండేలా ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన వెంటనే ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేయాలన్నారు. ఎక్కడ కూడా రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతులను కలిసి వారికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆయన అడిగి తెలుసుకున్నారు. సన్నాలకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2320తో పాటు బోనస్ రూపేనా ప్రభుత్వం రూ.500ల చొప్పున చెల్లించనుందని తెలిపారు. మద్దతు ధర బ్యాంక్ ఖాతాల్లో జమ అయిన వారం పదిరోజుల అనంతరం బోనస్ డబ్బులు కూడా జమ అవుతాయని కలెక్టర్ రైతులకు సూచించారు. యాసంగి సీజన్‌లో అందుబాటులో ఉండే సాగు నీటి వసతికి అనుగుణంగా అధిక దిగుబడి అందించే పంటలను మేలు రకానికి చెందిన వంగడాలను విత్తుకోవాలని ఆయన తెలిపారు. ఎలాంటి సందేహాలు ఉన్నా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తీసుకోవాలని అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కలెక్టర్ వెంట మెప్మా పీడీ రాజేందర్, కేంద్రం నిర్వహకులు ఉన్నారు.

● పకడ్బందీగా ఇంటింటి సమగ్ర సర్వే

నిజామాబాద్‌అర్బన్:అన్ని వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక, స్థితిగతుల విశ్లేషణ కోసం రాష్ట్ర ప్రభుతుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఇంటింటి సర్వే ప్రక్రియ జిల్లా కొనసాగుతందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. జిల్లాలో మొత్తం 469988 నివాస గృహాలకు గాను శనివారం సాయంత్రం నాటికి 295436 ఇళ్లలో వివరాలు సేకరణ జరిగింది, 62.86 శాతం సర్వే పూర్తయ్యిందని తెలిపారు.

ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలి

ఎడపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణకై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటీ కుటుంబ సర్వేకు మండల ప్రజలు తమవంతు సహకారం అందించాలని మండల ప్రత్యేక అధికారి ప్రదీప్ అన్నారు. శనివారం ఎడపల్లి మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలో ఇంటింటీ కు టుంబ సర్వే చేపడుతున్న తీరును ఆయన పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే కోసం ఇంటికి వచ్చే ఇన్యూమరేటర్లకు వాస్తవ వివరాలతోకూడిన సమాచారాన్ని అందించాలని సూచించారు. సర్వేలో అన్ని కాలమ్స్‌ను నింపాలని ఇన్యూమరేటరుకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి శంకర్, మంగల్‌పాడ్ పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి, ఇన్యూమరేటర్ తదితరులు ఉన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సమగ్ర కుటుంబ సర్వేను శనివారం మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమారేటర్‌లకు పక్క సమాచారం సేకరించి నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట సూపర్‌వైజర్ లక్ష్మణ్, రాజలింగం, తదితరులు ఉన్నారు.



ఆర్మూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

సుభాష్‌నగర్:నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక సర్వేపై నగర పాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని నగర పాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వే సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అడిగిన సమాచారాన్ని ప్రజలు ఎన్యూమరేటర్లకు ఇచ్చి సహకరించాలని ప్రజలను కోరారు. ఈసమావేశంలో అధికారులు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై నిఘా ఏదీ?

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నా మిగతా చోట్ల ఎక్కడా అనుమతులు లేకున్నా అక్రమ తవ్వకాలను చేస్తున్నారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, అటవీ భూములు, దేవాదాయ భూములతో పాటు చెరువు శిఖాలలో ఈ మట్టి, మొరం తవ్వకాలను చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా డిమాండ్ ఉండటంతో ఎక్కువ మొత్తంలో తవ్వకాలు చేసి అక్రమంగా తరలిస్తున్నారు. భవన నిర్మాణాలు, రోడ్ల నిర్మాణాలకు మట్టి, మొరం డిమాండ్ ఎక్కువగా ఉండటంతో అక్రమ తవ్వకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మట్టి, మొరం తవ్వకాలకు అన్ని మండలాల పరిధిలో అనుమతులు ఇస్తే అక్రమాలు ఆగే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన రాయాల్టీ పన్నులు రావడం లేదు. వచ్చే ఆదాయానికి కూడా గండి పడుతుంది. ముందే అనుమతులు ఇస్తే మండలాల వారిగా అక్రమ తవ్వకాలు ఆగే పరిస్థితి ఉన్నా పట్టించుకోవడం లేదు.

● జిల్లాలో జరిగే అక్రమ ఇసుక, మొరం, మట్టి తవ్వకాలకు నేతలు, ప్రజా ప్రతినిధుల అండదండలు ఉండటంతో అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మండల స్థాయిలో అక్రమ రవాణాకు పాల్పడే వారికి నేతలతో పాటు అధికారుల అండదండలు ఉండటం వల్ల రాత్రివేళల్లో తవ్వకాలు చేసి ఎక్కువ మొత్తంలో తరలిస్తున్నారు. నెలసరి మామూళ్లతో పాటు తవ్వకాలు జరిగిన సమయాల్లో కొంత మొత్తంలో డబ్బులను ఇస్తుండటంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ తవ్వకాలను ఆపడం లేదు. జిల్లాలో కీలకమైన నేతల అండదండలు కూడా కొన్ని ప్రాంతాల్లోనూ తవ్వకందారులకు ఉండటంతో వారిని ఆపేందుకు అధికారులు కూడా ధైర్యం చేయడం లేదు. రాష్ట్రస్థాయి పలుకుబడి ఉన్న నేతలతో పాటు జిల్లాస్థాయి నేతలు కూడా సహకరిస్తుండటంతో ఈ తవ్వకాలు ఎక్కువగా జరుగుతు న్నాయి. అక్రమంగా రవాణా జరిగేందుకు అవకాశం ఏర్పడింది. పవర్‌లో ఉన్న నేతలతో పాటు ప్రతిపక్ష పార్టీల నేతలు కూడా చాలా మండలాల పరిధిలో ఈ అక్రమ రవాణాను చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటంతో పెద్ద ఎత్తున ఈ తవ్వకాలు జరుగుతున్నాయి. ఏ మండలం పరిధిలో పరిశీలించిన ఇసుక, మట్టి, మొరం తవ్వకాలు ఆగడం లేదు. ప్రతీ మండలం పరిధిలో ప్రజల నుంచి వస్తున్న ఒత్తిళ్ల వల్ల కొన్ని కేసులను అధికారులు నమోదు చేస్తున్నారు. వాహనాలను సీజ్ చేస్తున్నారు. కొన్నిచోట్ల వాహనాలను సీజ్ చేసిన అధికారులకు నేతల నుంచి ఫోన్‌లు వస్తుండటంతో వదిలివేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వీటిని పూర్తిస్థాయిలో ప్రధాన శాఖలు సమన్వయంతో పనిచేస్తే అరికట్టే అవకాశం ఉన్నా నేతల ఒత్తిళ్లతో పట్టించుకోవడం లేదు. జిల్లాలో ఇసుక క్వారీలకు అనుమతులు లేవని ప్రభుత్వ అవసరాల కోసమే అనుమతులను మండల స్థాయిలో ఇస్తున్నారని అధికారులు తెలిపారు. అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు చేపడుతున్నామని వాహనాలను సీజ్ చేస్తున్నామని రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు తెలిపారు.

నేడు ఆర్మూర్‌లో ప్రకాష్ హ్యుందాయ్ ఉచిత కార్ చెకప్

నిజామాబాద్ అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):హ్యుందాయ్ కార్ల వినియోగదారులకు ప్రకాష్ ఆటో సర్వీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్మూర్‌లో ఉచిత కార్ల చెకప్ శిబిరం నిర్వహించనున్నారు. ఆర్మూర్‌లోని ఐవో సీఎల్ పెట్రోల్ బంక్ వద్దగల ప్రకాష్ ఆటో సర్వీస్ స్టేషన్‌లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఈఉచిత శిబిరాన్ని నిర్వహించను న్నారు. ఉచిత చెకప్‌తో పాటు కొత్త కార్ల ప్రదర్శన, టెస్ట్ డ్రైవ్, పాత కార్ల ఈ వాల్యుయేషన్ చేయడం జరుగుతుందని హ్యుందాయ్ కార్ల విని యోగ దారులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వహకులు తెలిపారు.

గురుకుల జోనల్ లెవల్ స్పోర్ట్స్ పోటీల్లో ఛాంపియన్‌గా ధర్మారం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

డిచ్‌పల్లి,నవంబరు16 (ఆంధ్రజ్యోతి):టెన్త్ జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌లో కంజర పాఠశాలలో ఈ నెల 11 నుంచి 14 వరకు నిర్వహించిన క్రీడ పోటీల్లో అన్ని విభాగాల్లో ఛాంపియన్‌గా విద్యా ర్థులు నిలవడం అభినందనీయ మని ప్రిన్సిపాల్ నుర్నిసా అభినందించారు. విద్యా ర్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆమె కోరారు. ఈక్రీడ పోటీల్లో నీరాజరెడ్డి, పీఈటీ స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ట్రాఫిక్ ఏసీపీ



మల్లారం గండిలో జరిగిన సంఘటన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ

మోపాల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లారం గండిలో జరిగిన రోడ్డు ప్రమాదం స్థలాన్ని శనివారం ట్రాఫిక్ ఏసీపీ నారాయణ సందర్శించారు. రోడ్డు ప్రమాదాలకు గల కారణాలను పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు, మొక్కలు పెరగడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అదేవిధంగా గండిలో ప్రమాదకరమైన మలుపులు ఉండటంతో కూడా సంఘటనలు ఎక్కువ అయ్యే అవకాశాలు ఉన్నాయని రూరల్ ఎస్సై ఆరీఫ్‌కు వివరించారు. రోడ్డుకు ఇరువైపులా మొలచిన మొక్కలను తొలగించాలని సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు.

ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలో చోరీ

నవీపేట,నవంబరు16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దర్యాపూర్ ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలో చోరీ జరిగిందని స్థానికులు తెలిపారు. శుక్రవారం రాత్రి పాఠశాలలో ఉన్న ఫ్యాన్‌తో పాటు బోరు కెబుల్ వైరు, ప్లాస్టిక్ పైపులను ఎత్తుకెళ్లినట్లు వారు పేర్కొన్నారు.

ఎస్‌జిఎఫ్ అండర్-17 బేస్‌బాల్ రాష్ట్ర పరిశీలకుడిగా గంగామోహన్

సుభాష్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జిఎఫ్ అండర్-17 బేస్‌బాల్ రాష్ట్ర పరిశీలకుడిగా మార్కంటి గంగామోహన్‌ను నియమించారు. ఈ మేరకు ఎస్‌జిఎఫ్ అధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్రస్థాయి పోటీలు నిర్మల్ జిల్లాలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరగనున్నాయి. ఈ పోటీలకు పరిశీలకుడిగా జడ్పీహెచ్ఎస్ తొర్లికొండ గ్రామానికి చెందిన ఫిజికల్ డైరెక్టర్ గంగామోహన్ ఎంపికయ్యాడు. పరిశీలకుడిగా ఎంపిక కావడం పట్ల మండల ఎంఈవో శ్రీనివాస్, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

18న జూనియర్, సీనియర్ బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్ ఎంపికలు

సుభాష్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ రూరల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న జూనియర్, సీనియర్ బాల బాలికల బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు రూరల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి మహేష్ తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ముందుగానే పేర్లను నమోదు చేసుకోవాలని అన్నారు. నగరంలోని పాలిటెక్నిక్ మైదానంలో ఈ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డు జిరాక్స్ వెంటతెచ్చుకోవాలన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులను ఈనెల 20వ తేదీన వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. మిగతా వివరాల కోసం 9014581059, 7013220107 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

● బాల్‌బాడ్మింటన్, క్రికెట్, చెస్ పోటీల్లో జిల్లాస్థాయి ఎంపిక

ఆర్మూర్‌టౌన్: ఉమ్మడి జిల్లాల జూనియర్, సీనియర్ బాలబాలికలు బాల్‌బాడ్మింటన్, చెస్ పోటీల్లో జిల్లాస్థాయి సెలక్షన్ కలవని జిల్లా రూరల్ గేమ్స్ అసోసి యేషన్ అధ్యక్షుడు అబ్బగోని అశోక్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీన వరంగల్‌లో జరగబోయే బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ సెలక్షన్‌లను జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్‌గ్రౌండ్‌లో ఈనెల 18న సెలక్షన్‌లను నిర్వహిస్తున్నామని ఆ యన తెలిపారు.

గంగపుత్ర సంఘ మండల అధ్యక్షుడిగా నవీన్

ఇందల్వాయి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గంగపుత్ర సంఘం ఇందల్వాయి మండల అధ్యక్షునిగా గన్నారం గ్రామానికి చెందిన వాల్గోట్ నవీన్ ఏకగ్రీవంగా శనివారం ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గంగపుత్ర కులస్తులు కలిసి ఎన్నుకున్నారు. ఐదేళ్ల పాటు నవీన్ అధ్యక్షపదవిలో కొనసాగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు వాల్గోట్ నవీన్, ఉపాధ్యక్షుడు దుబ్బాక స్వామి, ప్రధాను కార్యదర్శి పిప్పెర హన్మంతు, కోశాధికారి మైస గంగాధర్, పల్లికొండ ప్రవీణ్, కార్యవర్గ సభ్యులు బాలకిషన్, శ్రీనివాస్, పాపాయి కుమారస్వామి, శ్రీనివాస్, వాల్గోట్ ప్రవీణ్, దుబ్బాక సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.